# ప్రమోషన్


డి. శ్రీనివాస దీక్షితులు

రోజూ ఠంచనుగా పన్నెండు కొడితే గానీ ఆఫీసుకి రాని పద్మనాభం ఇవ్వాళ పది గంటలకు వచ్చి తన ఛాంబరులో కుర్చీలో కూలబడ్డాడు. కాసేపు కాగితాల మీద ఏదో బరికాడు.

అరగంట తర్వాత అటెండరుని పిలిచి "మోహన్! అందరూ వచ్చారా?" అడిగాడు ఆఫీసర్ పద్మనాభం.

"చూసొస్తాను సార్!" అంటూ బైటికెళ్లి, ఐదు నిమిషాల్లో మళ్లీ లోపలకొచ్చి "అందరూ వచ్చారు సార్! ఇంకా..." నసిగాడు మోహన్.

"ఊ ఎవరు రాలేదో అఘోరించు" గద్దించాడు పద్మనాభం.



"ఇంకా సుబ్బారావుగారు రాలేదు సార్" గబగబా చెప్పేసి ఏదో తప్పు చేసినట్లు నోరు కరుచుకున్నాడు.

సుబ్బారావు పేరు వినగానే కూల్ అయిపోయి "సుబ్బారావా... ఇవ్వాళ అర్జంటు పనేదో ఉంది కొంచెం ఆలస్యంగా ఆఫీసుకొస్తానని ముందుగా నాదగ్గర పర్మిషన్ తీసుకున్నాడులే" సర్దిచెప్పాడు ఆఫీసరు.

ఆయన మాటల్ని నూటికి నూరుశాతం నమ్మలేదు మోహన్.

అయినా... ఆయన ఆఫీసరు కనుక నమ్మినట్లుగా మొహం పెట్టి "అలాగా సార్" అన్నాడు మోహన్.

"సుబ్బారావు రాగానే అర్జంటుగా నన్ను కలవమని చెప్పు"

"అలాగే సార్"

మోహన్ బైటికెళ్లిపోయాడు.

కాసేపటికి సుబ్బారావు హడావిడిగా ఆఫీసుకొచ్చాడు. అతని ఒళ్లంతా చెమటతో తడిసిపోయి ఉంది. వచ్చి తన సీట్లో కూర్చున్నాడో లేదో మోహన్ అతని దగ్గరికెళ్లి ఆఫీసరు గారిని కలవమని చెప్పాడు. సుబ్బారావు వెంటనే లేచి కర్చీఫ్‌తో మొహానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టాడు.

పేపరు మీద ఏదో బరుకుతున్నాడు సీరియస్‌గా పద్మనాభం.

"గుడ్ మార్నింగ్ సార్!" బెరుగ్గానే విష్ చేసాడు సుబ్బారావు.

తల పైకెత్తి సుబ్బారావు వంక చూసి మళ్లా తలవంచుకుని ఏదో రాసుకుంటున్నాడు పద్మనాభం.

"అర్జంటు పనిపడి... కొంచెం లేటయింది సార్!" నసుగుతూ అన్నాడు సుబ్బారావు.

"నో ప్రాబ్లం... నో ప్రాబ్లం... ప్లీజ్ టేక్ యువర్ సీట్" తల పైకెత్తకుండానే అన్నాడు పద్మనాభం.

"ఆఫీసర్ ప్లీజ్ అంటున్నాడంటే తన కథాపఠనంతో నన్ను చిత్రహింస చెయ్యబోతున్నాడన్న మాటే" అనుకుంటూ ఆయనకి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు.

"రాత్రి పడుకునే ముందు కథకి క్లూ దొరికిందయ్యా! వెంటనే కాగితం మీద పెట్టేసాను. ఆఫీసుకి వచ్చిన దగ్గర్నుంచీ దానికి తుది మెరుగులు దిద్దుతున్నాను. ఇప్పటికి పూర్తయింది. దాన్ని నీకు వినిపిస్తే కానీ నాకు తృప్తిగా ఉండదు. అందుకే పిలిచాను" చెప్పాడు పద్మనాభం.

"ఇంటి దగ్గర కూడా కథలు రాస్తారా సార్!" అమాయకంగా అడిగాడు సుబ్బారావు.

"రాస్తాను కానీ... చదివి వినిపించను" చెప్పాడు పద్మనాభం.

"ఎందుకు సార్" కూతూహలంగా అడిగాడు సుబ్బారావు.

"మా ఆవిడ ఇంట్లో నోరు తెరిస్తే ఊరుకోదు. ఆమెకి కథలంటే ఎలర్జీ".

"ఎందుకు సార్ ఎలర్జీ?"

"అదో పెద్ద కథ... టూకీగా చెబుతా విను.

మా ఆవిడ తాతయ్య అద్భుతంగా కథలు చెప్పేవాడట. ఆయన కథలు చెబుతుంటే అందరూ నోళ్లు తెరుచుకుని వినేవారట. ఆయన పేరు కామేశ్వరరావు అయినా అందరూ "కథల కామయ్య" అని పిలిచేవారట. ఆయన ఒకసారి కథలు చెబుతూ... చెబుతూ గుండెపోటు వచ్చి పుటుక్కుమని చచ్చిపోయాడట. అప్పుడు మా ఆవిడ తాతయ్య దగ్గర ఉందట. కథలు చెప్ప

కుండా ఉంటే ఇంకా కొంతకాలం బతికేవాడు... కథలు చెప్పడం వల్లే తాతయ్య చచ్చిపోయాడని ఆమెకి మనసులో పడిపోయింది. అప్పటి నుండి ఆమెకి కథలంటే ద్వేషం ఏర్పడింది" చెప్పాడు పద్మనాభం.

"అయితే... ఇంట్లో కథలెప్పుడు రాస్తారు?" అడిగాడు సుబ్బారావు.

"ఆమెకి తెలియకుండా రాస్తాను. ఎప్పుడైనా నేను కథలు గురించి మాట్లాడితే బూజుకర్ర ఇచ్చి ఇల్లంతా దులపమంటుంది. బెడ్‌రూమ్‌లో అరగంటసేపు అటూ ఇటూ గెంతమంటుంది. ఇంకా ఇలాంటివి చిత్ర విచిత్ర విన్యాసాలు చేయిస్తుంది మా ఆవిడ. అందుకే ఆమెకు కథలు వినిపించను. ఎందుకైనా మంచిదని ఆమె నిద్రపోయిన తర్వాతే కథలు రాసుకుంటాను" బాధగా చెప్పాడు పద్మనాభం.

"అమ్మో! మీ మాటల్ని వింటుంటే ఒళ్లు జలదరిస్తోంది. ఈ విషయం తెలిస్తే... ఇంకేముందీ నా భార్యకూడా..." తల విదిలించి ఆ ఆలోచనలోంచి బైటపడ్డాడు సుబ్బారావు.

"ఏంటాలోచిస్తున్నావ్?" సూటిగా అడిగాడు పద్మనాభం.

"ఏంలేదు సార్!" తడబాటుగా అన్నాడు సుబ్బారావు.

"నువ్వు మాత్రం నా కథ వినాల్సిందే!"

"మీ కథ వినటం కంటే నాకు అదృష్టమేముంటుంది సార్" అని పైకి అంటూనే 'వినమంటే వినక చస్తానా? కథలూ వినిపిస్తావు... కాకరకాయలూ తినిపిస్తావు. నువ్వు ఆఫీసరువై పోయావు... నేను నీ సబార్డినేటునై పోయాను. నా ప్రమోషన్ నీ చేతిలో ఉండి చచ్చింది... లేకపోతేనా...' అని మనసులోనే పళ్లు పటపటా కొరికాడు సుబ్బారావు.

సుబ్బారావు మొహంలోకి సూటిగా చూస్తూ కనుబొమ్మలెగరేసాడు పద్మనాభం. మధ్య మధ్య కనుబొమ్మలెగరేస్తూ మాట్లాడటం పద్మనాభానికి అలవాటు.

"ఏం సుబ్బారావ్! మనసులో ఏదో..." అని పద్మనాభం అడగబోతుండగా మధ్యలోనే కల్పించుకుని "మిమ్మల్ని మనసులోనే మెచ్చుకుంటున్నాను సార్!" అన్నాడు సుబ్బారావు.

"ఏమనీ..." అడిగాడు పద్మనాభం.

"మీలాంటి ఆఫీసరు కింద పనిచెయ్యటం ఎంతో గొప్పగా అనుకుంటున్నాను సార్!" చెప్పాడు సుబ్బారావు.

"అంతా నీ అభిమానమయ్యా" పొంగిపోయాడు పద్మనాభం.

"కథలు రాసే ఆఫీసరు దొరకటం నా అదృష్టం సార్. మీలాంటి వారు కోటికొక్కరుంటాడు సార్!" అని తెగ పొగిడేసాడు సుబ్బారావు మనసులో తిట్టుకుంటూ.


"నీ మనసు వెన్నపూసయ్యా! వెరీగుడ్... వెరీగుడ్" పెద్దగా నవ్వుతూ అన్నాడు పద్మనాభం.

అలా నవ్వుతున్న పద్మనాభం వంకా... ఆ నవ్వుకి కదిలిపోతున్న అతని పెద్ద బొజ్జవంకా మార్చి మార్చి చూసాడు సుబ్బారావు.

"అంత ఖచ్చితంగా నా మనసు గురించి ఎలా చెప్పగలుగుతున్నారు సార్!" అనుమానంగా సుబ్బారావు.

"అదో విద్యత్! దాని పేరు పరచిత్త ప్రవేశ విద్య".

ఇది పరకాయ ప్రవేశ విద్యలాంటిది. చాలా కష్టపడి ఎదుటి వాళ్ల మనసులో ఏమనుకుంటున్నారో తెలుసుకునే ఈ విద్యని ప్రాక్టీసు చేసాను" చెప్పాడు పద్మనాభం.




"మీకీ విద్యలో పరిణతి వచ్చినట్టే ఉంది సార్!" అని చెప్పాడు సుబ్బారావు.

"నువ్వు చెప్పావంటే ఇంక తిరుగులేదయ్యా. ఈసారి నీకు ప్రమోషన్ ఖాయం! నేను నీకు గట్టిగా రికమండ్ చేస్తాను. నేను రికమండ్ చేస్తే నీకు ప్రమోషన్ వచ్చినట్టే లెక్క. జల్సా చేసుకో" అన్నాడు పద్మనాభం.

"అది నోరా... తాటిబద్దా. ఇలా నమ్మబలకటం నూటొక్కోసారి. ఎప్పటికప్పుడు నీ ముందు నేను గొర్రెనై పోతున్నాను. మూడేళ్ల నుంచీ ఇదుగో ప్రమోషన్... అదుగో ప్రమోషన్ అని ఊరిస్తూ... జల్సా చేసుకోమని చెబుతూ... నీ అడ్డమైన కథలన్నీ వినిపిస్తూ... నా జవసత్వాలన్నీ జలగలాగా పీల్చేస్తున్నావు... ఛీ! ఛీ!" అని మనసులోనే అనుకుని బయటికి మాత్రం "థాంక్స్ సార్" అన్నాడు సుబ్బారావు.

ఇప్పుడు సుబ్బారావుకి ఆఫీసరు చెప్పే కథల్ని వినేబాధ తప్పకపోయినా ఒకందుకు సంతోషంగా ఉంది. ఆఫీసర్ని మనసులో కసితీరా తిట్టుకోవచ్చు. ఆ విషయం ఆఫీసరు తెలుసుకోలేదు. తనకి తెలుసునని అతను చెప్పుకుంటున్న పరచిత్త ప్రవేశవిద్య నిజంగా అతనికి తెలియదని... ఊరికే తెలుసునని బుకాయిస్తున్నాడనీ అతన్ని బాగా పరీక్షించి సుబ్బారావు నిర్ధారించుకున్నాడు.

* * *

ఆఫీసరు పద్మనాభం రోజూ తాను రాసే చెత్త కథల్ని సుబ్బారావుకి వినిపించటం పనిగా పెట్టుకున్నాడు. ఆఫీసులో మరో కథాభిమాని దొరక్కపోవడంతో రోజూ సుబ్బారావుకి ఈ బాధ తప్పటం లేదు.

ఆఫీసరు వినిపించిన కథని విని ఊరుకుంటే కుదరదు. తలా తోకా లేని ఆ కథల్ని మెచ్చుకోవాలి... వాటిని ప్రచురించకుండా తిప్పి పంపిస్తున్న పత్రికల్ని చెడామడా తిట్టాలి. ఇవన్నీ సుబ్బారావు చేస్తూనే ఉన్నాడు. ఒక్కొక్కసారి ఆ కథల్ని వింటూంటే సుబ్బారావుకి తల తిరిగిపోతూంటుంది. అయినా... ఆ బాధలన్నీ దిగమిం

గి ప్రమోషన్ కోసం మూడేళ్లుగా ఆఫీసరుగారి కథల్ని వింటున్నాడు సుబ్బారావు.

పద్మనాభం ఆఫీసరుగా వచ్చిన కొత్తలో ఆయనకి కథలంటే చచ్చేంత ఇష్టమనీ... కథలు రాస్తుంటాడనీ విని సుబ్బారావు ఆయన్ని ఇంటి కెళ్లి కలుసుకున్నాడు.

కొత్త ఆఫీసర్ని కాకా పడదామనుకుని రెచ్చిపోయాడు సుబ్బారావు.

"సార్! కథలంటే నాకు చచ్చేంత ఇష్టం. కాలేజిలో చదివేరోజుల్లో మ్యాగజైన్ కోసమని రెండు మూడు కథలు రాసాను. మా తెలుగు మాస్టారు వాటిని తెగమెచ్చుకున్నట్టు గుర్తు. ఉద్యోగంలో చేరిన తర్వాత గానుగెద్దు జీవితమయింది. ఒక కథా లేదు... కమామీషూ లేదు. ప్రోత్సాహమూ లేదు" అంటూ తనని తాను గొప్పగా పరిచయం చేసుకున్నాడు సుబ్బారావు.

అతని మాటల్ని వింటూనే చిరునవ్వు చిందిస్తూ తన కథలకట్ట అంటే ఎర్రరంగు ఫైలు తీసాడు ఆఫీసరు పద్మనాభం. ఏకధాటిగా రెండు గంటలపాటు గుక్కతిప్పుకోకుండా తాను రాసిన, ఏ పత్రికా ప్రచురించకుండా తిప్పిపంపిన కథల్ని సుబ్బారావుకి వినిపించాడు. ఆ దెబ్బతో దిమ్మతిరిగి రెండ్రోజులు సెలవుపెట్టి ఆఫీసరు మొహం చూడలేదు సుబ్బారావు.

ఆ తర్వాత... దిక్కుతోచక, వేరేగతిలేక మెల్లగా ఆఫీసరుగారి కథాశ్రవణానికి అలవాటుపడ్డాడు సుబ్బారావు.

ఒక రోజు సుబ్బారావుని వెంటబెట్టుకుని ఆఫీసు నుండి ఇంటికి తీసుకెళ్లాడు పద్మనాభం. సుబ్బారావుని డ్రాయింగు రూమ్‌లో కూర్చోబెట్టి హుషారుగా లోపలకెళ్లాడు పద్మనాభం. సుబ్బారావుకి తన ప్రమోషన్ ఖాయమనిపించింది. ప్రమోషన్ వస్తే జీతం పెరుగుతుంది. జీతం పెరిగితే ఏమేం కొనాలో తన బడ్జెట్ పరిధిలో సుబ్బారావు తీరిగ్గా ఆలోచించుకుంటున్నాడు. శ్రీమతి కాపరానికి వచ్చినప్పటి నుంచీ తనకి నెక్లెస్ కొనిపెట్టమని పోరుపెడుతోంది, అది కొనాలా?... ఎవరైనా నలుగురైదుగురు గెస్టులు ఇంటికొస్తే కూర్చోవటానికి సోఫాసెట్ ఉంటే బాగుంటుందని ఎప్పటినుంచో తాను అనుకొంటున్నాడు... అది కొనాలా?... ఆఫీసులో అందరికీ బైకులున్నాయి. తనకి లేదు. అది కొనాలా? అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో లోపల్నించి పెద్దకేక వినిపించింది.

సుబ్బారావుకి గుండె జల్లుమంది.

"కాంతం! ఇక్కడ నా కథలఫైలుండాలి... ఏదీ?" కోపంగా అరిచాడు పద్మనాభం.

"ఎందుకు ఊరికే అలా అరుస్తారు? నేనూ మీకంటే గట్టిగా అరవగలను. మీకు కథలపిచ్చి ఉందని తెలిస్తే మిమ్మల్ని అసలు పెళ్లి చేసుకునే దాన్నే కాదు. మా తాతయ్యలాగా మీరు కాకూడదని... ఈ కథలు మీ ప్రాణం తీయకూడదని ఈ రోజు నేను ఒక నిర్ణయానికొచ్చాను. అందుకే పొద్దున్నుంచి కాపలాకాసి పాతపేపర్లు కొనేవాడిని పిలిచాను. ఎర్రరంగు ఫైల్లో పెట్టిన మీ కథలన్నింటినీ వాడికమ్మేసాను. వాడికి కథలంటే పిచ్చట. కేజీ పేపర్లు పదిరూపాయలకి కొనేవాడు మీ కథల కాగితాల్ని కేజీ ముప్పైరూపాయలకి కొన్నాడు. ఎవరి పిచ్చి వాడికానందం!" ఏదో ఘనకార్యం చేసినట్టు సంతోషంగా చెప్పింది పద్మనాభం భార్య.

భార్యని ఏమీ అనలేక తన కోపాన్ని ఎలా అణుచుకోవాలో తెలియక సతమతమవుతూ సుబ్బారావు దగ్గరికొచ్చి "సుబ్బారావ్! నీ ప్రమోషన్ కేన్సిల్" అనేసి లోపలికెళ్లిపోయాడు ఆఫీసరు పద్మనాభం. ●